అంత సరికొత్తతారల 'తేనెమనసులు'

అదుర్తిగారు మొత్తానికి బలేపనిచేశారు. ఆంధ్ర సినీజనానికి బలే మజాచేశారు. అంతా బ్రాండ్ న్యూఅంటే సరికొత్తనటీనటులతో సినిమా తీస్తానన్నాడు, తీశాడు. అతీయడంలో కూడా బలేగా తీశాడు. తెలుగు సినీజనం నాలుగుకాలాలపాటు బలే ఆనందించేట్టు, తెలుగు దినపత్రికజనం బలేగా పొగిడేటట్టుతీశాడు. మరి మనమూ పొగడకుంటే యెట్లాచెప్పండి?

మనకు యెన్నాళ్ళనుంచో నాగేశ్వరరావు, ఎన్టీరామారావు, సావిత్రమ్మ, కృష్ణకుమారమ్మ, జమునమ్మ, సూర్యకాంతమ్మ, రేలంగి, రమణారెడ్డి, పద్మనాభం ఇట్లాంటి, రకరకాల హేమాహేమీ, మహామహా, రెడీమేడ్ నటులుండగా వీళ్ళనంతా కాలదన్ని యెవరో కోనకిస్కాగాళ్ళతో అదుర్తిగారు రంగుల్లో సినిమా తీసెయ్యంగానే బం. గో. రె. పొగడమంటున్నాడేమిటి అని కిందతరగతుల సాదా ప్రేక్షకజనంఅంటే అననీగాక, ఒకటి మాత్రం నిజం. ఈ సంచలనచిత్రం 'తేనెమనసులు' చూసినతర్వాత యెవరికైనా ఎంతో రిలీఫ్ అనిపిస్తుంది, ఏదో సంతృప్తి

బం. గో. రె.
మితవాదం

అనిపిస్తుంది, నిజంచెప్పొద్దూ. వెండితెరమీద వరసబెట్టి పాతమొహాలు చూసిచూసి మొహంమొత్తిన పైతరగతి జనానికి యిందులో వొక్కసారిగా అమాంతం సరికొత్త నటీనటుల్ని రంగుల్లో చూసేసరికి గుండెకాయ యెక్కడికో లేచిపోయినట్లనిపిస్తుంది. రెండున్నర తరాలపాటు అదే రాటుదేలిన ముదురుమొహాల్ని చూసిచూసి రాళ్ళయిపోయిన మన రసనాడులు ఇందులో వొక్కసారిగా అదుర్తిగారు లేత లేత మొహాలను తీసుకొచ్చి రంగులుబూసి తైతక్కలాడించి ముఖపరిచయం చేయించారంటే, చెప్పానుగా రాళ్ళైపోయిన మన రసనాడులు జివ్వుమనకేంచేస్తాయ్? ఒకరుగాదు, ఇద్దరుగాదు హాల్ మొత్తంమ్మీద పద్నాలుగుమంది నవనవలాడే నటీనటుల్ని మనకు పరిచయంచేసి రంగుల్లో సినిమాగా తీసి వెండితెరమీద వొక నవశకానికి నాంది పలికిందారుగనుక అదుర్తిగారిని మనందరంకలిసి ఆనందంగా ఆకాశానికెత్తేస్తాం. ఈ వొక్కఛాన్సును మనకు కల్గించినందుకు అదుర్తిగారికి మనందరం వొక్కుమ్మడిగా జే జేలు చెప్పుకుందాం. అట్లా చెప్పుకోవడం మన విధికూడా.

ఈ శుభసందర్భాన నాకో బెంగాలీ కళాకారుడు జ్ఞాపకానికొస్తున్నాడు. సత్యజిత్ రాయ్ అనేఆయన యింకాయింకా సరికొత్త సంచలనాన్ని కల్గిందాడామధ్య. అసలాయన దర్శకుడుగానే కొత్త. నటీనటుల్నందరినీ కొత్తవారిని యెన్నుకొని, అంతటితో ఆగకుండా సాంకేతికనిపుణుల్ని కూడా కొత్తవారినేతీసుకొని, అంతటితో ఆగకుండా కథనుకూడా సరికొత్తది తీసుకొని చిత్రంతీశాడు సరికొత్తధోరణిలో. సినిమాప్రపంచం ఆయనకు చేతులెత్తి నమస్కరించింది. అంతటితో ఆయన ఆగలేదు. అదేధోరణిలో కొత్తకథల్ను ఎన్నుకొని, కొత్తతారల్నేతీసుకొని కొత్తదారుల్ని అన్వేషిస్తూ కొత్తకొత్త కళాఖండాల్ను తీస్తున్నాడు. ప్రపంచదేశదేశాలుఆయనను కీర్తిస్తున్నాయి, ఆయనకు జోహారులర్పిస్తున్నాయి. ఆయన నిస్సందేహంగా కళాకారుడు, నిజమైన కళాకారుడు.

ప్రపంచ స్టాండర్డును చేరుకొందామనే దురాశకుపోలేదు మన అదుర్తిగారు. మన అదుర్తిగారు ఆకోవకుచెందిన కళాకారుడు కాదనేవిషయం అక్షరాలా నిజంకావచ్చు.

చిత్రసమీక్ష

అచ్చం ఆంధ్రసినీరక్తం ప్రవహించే మడుగులో యీదులాడేవాడుగనుక, అదీగాక ఆయన మంచి వ్యాపారదక్షులుకూడా గనుక; కేవలం కళ, సంస్కృతి అని పేర్లుచెప్పుకొని డబ్బులు పోగొట్టుకొనే బెంగాలీ వెర్రినాగన్నలమాదిరిగా గాకుండా కాస్త వళ్లు దగ్గరపెట్టుకొని, లెక్కాచార ప్రకారం సర్వలక్షణ సంభరితంగా సినిమాలుతీసి జనాల్ని రంజింపజేసే చతురులుగనుక ఆదుర్తిగారు యీ మన మామూలు తెలుగుకోవనే ఎన్నుకొని యీ 'తేనెమనసులు' తీశాడు.

ఒక్క నటీనటులవరకే కొత్తవారుకానీ, తెరవెనుక తతంగంనడిపించే సాంకేతికులంతా పాతవారే కథ ఎన్నుకోవడంలో కూడా ఆదుర్తిగారు యెందువల్లనో కాస్త వప్పులో కాలేశాడనేచెప్పాలి. ఎందరెందరో తెలుగు సినిమాదర్శకులు నమిలి నమిలి వుమ్మేసిన పిప్పిలోనుంచి నాలుగు పీసులుతీసుకొని అల్లిన కథనే యెన్నుకొన్నాడు. పోనీ తీసుకొన్న కథనేమైనా క్రొత్తట్రీట్‌మెంట్ జతచేసి క్రొత్తపంథాలో నడిపించారా అంటే అదీలేకుండా మామూలు మొరటుమార్గాన్నే పట్టుకొని వేళ్లాడాడు. అవే దిక్కుమాలిన యుగళగీతాలు, యేనాది చిందులనబడే డ్యాన్సులు, సినిమాల్లోతప్ప మరెక్కడా కాగడాపెట్టి గాలించినా కనపడని ఫక్తు సినిమాకథ మలుపులు, పడికట్టు రాళ్లవంటి కనుకట్టు దృశ్యాలు, సెక్సుహస్కులు–ఇత్యాదివన్నీ చొప్పించారు.

మన ప్రబంధనాయికా కన్యకామణుల విరహతాపోత్సవం మీకు తెల్సుననుకొంటాను – రాత్రిళ్లు వయ్యారంగా వనంలో విహరిస్తూ చంద్రుణ్ణి తిట్టడం, పైటల్లేకుండా వద్మికలమీదపొర్లాడడం, తామరతూడులతో దేహాన్నంతా తాపటం పట్టించుకోవడం–యివన్నీ క్రమంతప్పకుండా జరిపిస్తుంటారు. ఈ మన ప్రబంధాలను ఆదుర్తిగారు స్వయంగా చదివివుంటారో లేదోగాని, మన కవులగాళ్లచేత చెప్పించుకొని ప్రబంధనాయికలతత్వాన్ని బాగా వంటబట్టించుకొన్నవాడుగా కన్పిస్తున్నాడుగనుక ఆ ధోరణిలోనే యీ తేనెమనసుల నాయికలచేతకూడా చేయిస్తాడు. పెండ్లి నిశ్చయమైందని తెలవంగానే సుకన్య, సంధ్యారాణి యిద్దరూ చందమామపాట పాడ్తూ చంద్రుణ్ణి ఆడిపోసుకుంటూ వాళ్ల చేత పైటలు యెగరేయించి, వక్షోజ ప్రదర్శన గావించి, వాళ్లను నేలమీద పరహోల్లా పొర్లాడమని విరహతాపాన్ని వెచ్చగా వొలకబోయిస్తాడు. క్రిందతరగతి జనమేగాకుండా పైతరగతి జనంకూడా బలేబలేగా చప్పట్లుకొడ్తూ, యీలలేస్తూ సొమ్మసిల్లిపోయి చూస్తారు. శ్రీనాధుని శృంగారనైషధభావాన్ని తీసుకొని దాశరధి పాటవ్రాశారట–భర్త అమెరికానుంచి తిరిగొస్తున్నాడని సంధ్యారాణి కమ్మని కలగంటుంది. ఆ కలలో ఆ హంస హంసగమనకావడం, ఇద్దరూకల్సి యానాదిదంపతుల్లాగ చిందులేస్తూ గంతులేయడం, అర్థనగ్నదేహంలో నైలాన్ పేలికలు చుట్టుకొని బాహుమూలాల్ని ప్రదర్శిస్తూ చిందులనృత్యం చేయడం–దీన్నే హంసనృత్యమనిచెప్పడం, అఖిలాంధ్ర సినీప్రేక్షకజనం మెచ్చుకొనేటట్లు మరొక దృశ్యాన్ని కూడా చిత్రీకరిస్తాడు. సరే యిక మననేటి

—తరవ 10 వ పేజీలో

మలినము, కల్మషములేక, కనికరము; కమ్మదనముగలమనసులే 'తేనెమనసులు'. కుటిలస్వభావము, మోహావేశములతో తేనెబూసిన మనుషులావున్నారు. కాని ఆ తేనెమనసులుగల మనుష్యులు వారి చేదు మనసులనుమార్చి, తేనెమనసులుగా జేస్తారు. యీ జాతికి చెందినచిత్రమే బాబూ మూవీస్‌వారి 'తేనెమనసులు'. ఈ చిత్రానికి అనేక సన్మానాల నందుకున్న శ్రీ అదుర్తి సుబ్బారావుగారు దర్శకుడు.

సరిక్రొత్త నటీనటులతో, ఈస్ట్‌మన్ కలరులో, తెలుగులో, పూర్తి వ్యాపార సరళిలో ప్రథమంగా తయారైన చిత్రం 'తేనెమనసులు'. ఇందుకు అదుర్తిని అభినందిస్తున్నాము. ఈ చిత్రాన్ని ప్రథమంలో నలుపు తెలుపులో కొంతవరకు తీశారు.

గ్రి. గో. రా.
అతివాదం

దాన్ని అలాగేపూర్తిచేసి రిలీజ్‌చేస్తే మరుటపాలలో 'ఫిలింబాక్సు' యిల్లుచేరుకుంటుందనే సందేహం అదుర్తిగారికి పూర్తిగా కలిగినట్టుంది. సినిమా ఫక్తువ్యాపారంక్రింద భావించేవాడుకాబట్టి వెంటనే ప్రత్యేక ఆకర్షణతో, రంగుల్లో చిత్రం నిర్మించేశాడు. పాపం పాచిక అనుకున్నంతగా పారలేదు.

చిత్రంలో అసలు కథలేదు. ఉన్నంతలో బిగువులేదు. కథాగమనంలో ఏదో క్రొత్తదనం చూపాలనుకున్న ప్రయత్నం వెక్కిరింపుగా తయారైంది.

చిత్రంలోప్రతిఒక్కసన్నివేశముపాతదే. ఇదివరకు మనం యెన్నోచిత్రాల్లో చూచినదే. చందమామనుచూస్తూ పాటపాడుతూ విరహాన్ని వొలకబోయడం; కొండదారుల్లో, ఏటిగాలుల్లో, సముద్రతీరాల్లో, చేతులుపట్టుకొని, మూతులు కలుపుకొని జతగా గీతాలుపాడుకొంటూ ప్రేమజంటలు పరుగులుతీయడం; ప్రేమికులు కమ్మని కలలుకనడం; ఆ కలలను ఏ నృత్యంలోనో చిత్రీకరించడం; పీటలమీదపెళ్ళి ఆగిపోవడం; ప్రేమించినపిల్లను బలాత్కారంగా కారులోవేసుకొని పరుగులుతియ్యడం; హీరో, 'స్కూటరు'మీద వెంటాడటం; యిద్దరికీ ముష్టియుద్ధాలు–యివన్నీ యెన్నో చిత్రాలలో చూచినవే. గాలంవేసి పట్టుదామన్నా మచ్చుకు ఒక్క క్రొత్త సన్నివేశంగూడా చిక్కదు. ఆ మాత్రానికి చిత్రానికి ఒక దర్శకుడు అవసరమా అనిపించింది.

సన్నివేశాలుపాతవైనా, పతాకస్థానము అందుకోగలిగినస్థాయి వాటికివున్నా కనీసము వొక్కసన్నివేశమైనా పతాకస్థానం అందుకోలేకపోయింది. ముఖ్యంగా బస్సు యెక్కేప్పుడు అక్కడ పెద్ద గుంపుకూడా లేదు. డబ్బు దొంగతనంచేసేసన్నివేశం చప్పగావుంది. దొంగతనం జరిగినతర్వాత తప్పును తననెత్తినరుద్దుకొని యెవ్వరికీ చెప్పకుండా శ్రీనివాసరావు పారిపోవటం సమర్థనీయంగాలేదు. పసికూతురు మాటలు విని డబ్బుకోసం దొంగతనంచెయ్యాలని నడుంకట్టడం నగుబాటుగావుంది. భానుమతిపెండ్లి ఆగిపోయిన సన్నివేశం ప్రేక్షకులను ఏ కొంచంగూడా కదిలించలేకపోయింది. చిట్టిబాబు మొదట్లో పుస్తకాల పురుగు, పెండ్లయినప్పటినుంచి పుస్తకమే ముట్టడు. పుస్తకాలు నిరంతరంచదివే జాడ్యం అంత సులభంగా పొయ్యేదికాదు.

ఉన్నతవిద్యలనభ్యసించి అమెరికానుంచి తిరిగివచ్చిన చిట్టిబాబులో అంత పతనాన్ని చూపటం, తల్లిదండ్రులలాంటి అన్నను, వదినను తిట్టడం, వారిముఖాన అన్నం విసరికొట్టడం, భార్యను ఇంటినుంచి వెళ్లగొట్టడం చాలా జుగుప్సాకరంగావున్నాయి. ఈపాత్ర చిత్రీకరణ అదుర్తిగారు ఏ వ్యాపారకీలకం దృష్టిలోవుంచుకొని చేశారో! చిట్టిబాబు తన పర్సనల్ సెక్రటరీ భానుమతిని ప్రేమిస్తాడు. కాని భానుమతి చిట్టిబాబును అతని భార్య సీతను ఏకం చెయ్యాలని ప్రయత్నిస్తుంది. పగలంతా చిట్టిబాబుతో ప్రేమను నటిస్తుంది. రాత్రి పూట తనయింటికివచ్చిన చిట్టిబాబుదగ్గరకు అతనిభార్య సీతను పంపుతుంది. అతను సీతను భానుమతిగా భావించి అనుభవిస్తాడు. ఎంతచక్కని ప్రశంసనీయమైన సన్నివేశమో చూడండి. ఈ సన్నివేశాన్ని యిదివరకే కొన్ని జానపదచిత్రాల్లో చూచివుండొచ్చు. కాని ప్రథమంగా యీ గొప్ప సన్నివేశాన్ని సాంఘికచిత్రంలో చూపించిన ఘనకీర్తి అదుర్తిగారికే దక్కుతుంది. చీకటిగదిలో మనిషిరూపం గుర్తించలేకపోవచ్చు. సీతగొంతు, భానుమతిగొంతు చిట్టిబాబుకు పరిచయమేగదా! గొంతువిని యెదుటిమనిషినిగుర్తించే జ్ఞానశక్తి ప్రతిమానవుడికీ వుంటుందిగదా! కాని అదుర్తిగారు 'తేనెమనసులు'చిత్రంలో చిట్టిబాబుపాత్రకు ఆ జ్ఞానశక్తిని పూర్తిగా పోగొట్టాడు. ఫక్తు వ్యాపారి ఏ పైశాచి కానికైనా తయారే.

చిత్రంలో చాలాచోట్ల 'కంటిన్యూయిటీ' దెబ్బతిన్నది. తనభర్త అమెరికానుంచి తిరిగివస్తున్నాడని విన్న సీత ఆ క్షణంలోనే వొకగుంజను గట్టిగా కరచుకొని కమ్మనికలగంటుంది. కలకుముందు ఒక చీర ధరించివుంటుంది. కలనుంచి తేరుకోగానే వేరేరంగుచీరలో తయారవుతుంది. ఒకచోట భానుమతిప్రియుడు ఫౌంటెన్‌లో తడుస్తూ ఆమెదగ్గరకు వస్తాడు – కాని చొక్కాగాని, తలగాని నీటితో తడిచినట్లే కనుపించవు. రోజూ రాత్రిపూట తాను సుఖిస్తూవుంది తనభార్య సీతతోనని ఒక రోజురాత్రి చిట్టిబాబు తెలుసుకుంటాడు. ఇంత మోసంచేసినందుకు భానుమతిపై పగ తీర్చుకునేందుకు బలాత్కారంగా ఆమెను తన కారులోవేసుకొని పరుగు తీస్తాడు. వెనకాల హీరో తన స్కూటర్ మీద వెంటాడుతాడు. అది రాత్రి సమయం. ఎంతోదూరంపోతారు. కారు, స్కూటరు అడ్డదారుల్లోగూడా పరుగెత్తుతాయి. కాని వాటికి లైట్లుండవు. ఇలాంటివి చెప్తూపోతుంటే చాలావున్నాయి. అనేక సన్మానాలనందుకున్న శ్రీ అదుర్తిగారి దర్శకప్రతిభకు ఇవన్నీ ప్రతిబింబాలు. ఏమండీ అదుర్తిగారూ యిలా చిత్రంతీశారే అని యెవరైనాఅడిగితే అర్థంలేని ఆవేశంతో వుగ్రుడైపోతాడు. మీకు చిత్రం అర్థంకాలేదంటాడు. ఇదివరకు వొక సన్మానసభలో యిలాఅన్నాడుగాబట్టి యిది చెప్పవలసి వచ్చింది.

నటీనటులు క్రొత్తవారైనా 'ఒరిజినాలిటీ' వున్నవారుగా కనుపిస్తున్నారు. ముఖ్యంగా కృష్ణ, రామమోహన్, సుకన్య, సంధ్యారాణి ముఖ్యపాత్రల్లో చక్కగా కనుపించారు. సుకన్య ఉచ్చారణ తేనెకన్నా తియ్యగావుంది. వీరి 'ఒరిజినాలిటీ'కి మెరుగుపెట్టగల దర్శకునిచేతిలో చక్కగా రాణించగలరు. తప్పకుండా తారాపథం అందుకోగలరు.

అదుర్తిగారు క్రొత్తతారాగణానికి చక్కనినటన నేర్పటంలో శ్రద్ధతీసుకోకపోయినా, ఆ తేనెమనసుల్లో యిప్పుడే

—తరవ 10 వ పేజీలో

రేపల్లె డి॥ ము॥ కోర్టులో

Court File S. C. 12 of 65

ఈడె పిచ్చయ్య, అయిలవరం —వాది.
వరుల సుందరరామమూర్తి S/o కృష్ణమూర్తి, బాపట్ల —ప్రతివాది.

ఈ నెంబరు వాది ప్రతివాదిపై ప్రోనోటునుబట్టి దావాచేసి యెన్నిసార్లు దావా నోటీసుచేసినను ముట్టనందున జమీన్‌రైతు పత్రికప్రచురణద్వారా ప్రతివాదికి నోటీసు నిమిత్తం 17-4-65 తేదికి వాయిదావేసినారు. ఈ విషయమై ప్రతివాదికి ఆక్షేపణలున్నయెడల సదరు తేదిన పగలు 10 గంటలకు సదరు కోర్టువారియెదుట హాజరై తెలియపరచుకోవలెను.

—కె. రామస్వామి, వాదిఅడ్వకేటు.

డోను డి॥ ము॥ కోర్టులో

E.P. 196 of 64 O.S. 117 of 62

గుండా వెంకటరత్నంశెట్టి—డిక్రీహోల్డరు.
పట్టిపేళ్ళ వెంకట —జె. డి.

పై నెంబరులోని జె. డి. యొక్క చిన్నమల్కాపురం గ్రామంలోని యస్. నె 479ఎ, యస్. నె 479బి లలో అర్థం రాసినను పైకోర్టువద్ద 15-4-1965 తేదీన బహిరంగముగా వేలం వేయబడును. సర్కారు సవాలు రూ. 650/- లు సవాలుదార్లు సవాలు పాడవచ్చును. వివరములు డి. హో. అడ్వకేటుగారి ఆఫీసులో కనుగొనవచ్చును.

—వి. శ్రీనివాసులు, అడ్వకేటు.

కందుకూరు డి॥ ము॥ కోర్టులో

S. C. No. 381 of 1964

వుప్పుటూరి కొండపనాయుడు —వాది.
బోడా మాలకొండయ్య S/o వెంకయ్య అరివేములమజరా, జంగంవారిపల్లెగ్రామం (వయా) సి. యస్. పురం, కనిగిరి తా॥ —ప్రతివాది.

ప్రతివాదికి దావా నోటీసు: యీ నెంబరున వాది నీవద్దనుండి రూ 210 లు వగైరా పరిహారములు రాబట్టుకొనుటకు యీదావా చేసియున్నాడు. కాన నీకుగల ఆక్షేపణలనుపైకోర్టువారియెదుట 24-4-65 తేదిన పగలు 11 గంటలకు హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల పరోక్షమందు తీర్మానించబడును.

—వి. తిరుపతినాయుడు,
వాది అడ్వకేటు.

★★★ తేనెమనసులు ★★★

(9 వ పేజి తరువాయి)

బం. గో. రె.

నవీననాయకా నాయికలు ప్రేమించుకొన్న తర్వాత విహారాలకు పోకుండావుండలేరు గదా! ఏ వూటీకో, బృందావనగార్డెన్సుకో, హైద్రాబాద్ పబ్లిక్‌గార్డెన్సుకో వెళ్ళిందే వాళ్లదేహాలు, తేనెమనసులు హీరెక్కువ గనుక అక్కడ యుగళగీతాలు పాడుకోవాల, గంతులేయాల, యిష్టమొచ్చినట్టు పొర్లాడాలగనుక, పైగా యిదంతారంగుల్లో తీశాడుగనుక 'ఓహో' ప్రేక్షకులకళ్లు చెదిరిపోతాయి!

ఇవిగాక యింకా వొకటి రెండు స్వల్పమైన విషయాలు గమనార్హంగావున్నాయి. ఒక హైస్కూలు డ్రిల్లుటీచర్‌కు సాధారణంగా సైకిల్‌కొనే తాహతుకూడావుండదే. తేనెమనసుల్లో డ్రిల్లుటీచరుగా పనిచేస్తున్నట్లు నటించిన కృష్ణమాత్రం స్వంత స్కూటర్‌లో హాయిగా చక్కర్లుకొడుతుంటే మన ప్రభుత్వంచూస్తే దేశంలో డ్రిల్లు టీచర్ల స్థితిగతులు భేషుగ్గావున్నాయే అనుకొని అసూయచెంది వాళ్ల జీతాలుతగ్గించేస్తే పాపం వాళ్ల గతేంకావాలి?

అట్లనే, ఈ సినిమాలో మొత్తంమీద నాల్గయిదు జంటలున్నాయి. ఈ నాల్గయిదు జంటలుకూడా దాదాపు వొకేరకమైన కొత్తగాకట్టిన పెద్ద పెద్ద అల్ట్రామాడరన్ భవంతుల్లో నివసిస్తుంటారుగాని తమ కూతుళ్లకోసం, మరదళ్ళకోసం కోన్ కిస్తా పదివేల రూపాయల కట్నంకోసం అట్లా దేవుళ్లాడడ మేమిటిఅనిపిస్తుంది. ఒకవేళ అవి బాడుగ భవంతులనుకున్నాకూడా వాటిల్లో నివసించేవాళ్లకు అదొక లెక్కా అనిపించదూ! వాళునివసించే ఆ పెద్దభవంతులు చూస్తూవుంటే ఇటీవల సంజీవరెడ్డి నగర్ కాలనీలో మంత్రులకోసం కట్టిన యిళ్ళలోనే వీరు షూటింగ్ జరిపారాయేంఖర్మ అనిపిస్తుంది. ఒకవేళ అట్లా అనిపించాలనే అదుర్తిగారు తీశారేమో! అదే నిజమైతే ఇందులో బోలెడంత సెటైర్‌వుందని వొప్పుకోవాలి. కడకు కడుపు చేత్తోపట్టుకొని ఎక్కడైనా వుద్యోగంచేసుకొని బ్రతుకుదామని తన అమ్మతో బయలుదేరిన సుకన్యకూడా యిలాంటి పెద్దభవంతిలోనే బాడుగకు చేరడంలో ఔచిత్యమేమిటో అదుర్తిగారే సెలవీయాలి.

అఖరుగా ఒక చిన్నవిషయంచెప్పి ముగిస్తాను. సుకన్య రామ్మోహన్‌ను ప్రేమిస్తున్నట్లు నటించి తనయింటికిపిల్చి గదిలో చీకటిచేసి తనబదులు సంధ్యారాణిని శోభనానికిపంపడం సబబుగా వుందా లేదా అనేచర్చ వదిలేద్దాం. లైట్లు అరిపోతే గది చీకటికావాల్నా లేదా? మన నిత్యానుభవంలో కూడా మన కబోది కరెంటు ఫెయిల్‌అయి లైట్లు ఆరిపోతే మనం చీకట్లో పడిగాపులుకాస్తామే, అట్లాంటిది స్విచ్చినొక్కి లైట్లు ఆర్పేసినాకూడా అ గదిలో చీకటి అనిపించదే! ఇంకా యెక్కడో మూల జీరోబల్బులు వెలుగుతున్నట్లేఅనిపిస్తుంది. ఇది బాగుందాఅని అడుగుతున్నాను. ఈ దృశ్యచిత్రీకరణ బొత్తిగా అసహజంగా వున్నదంటున్నాను. నరే అఖరుషాటులో అందరూ కల్సి గుంపుఫోటో తీసుకోవడం హాస్యాస్పదంగా లేదంటారా?

ఎన్నన్నా హాల్‌మొత్తంమీద చూసినపుడు చిత్రం పరవాలేదనే అనవల్సివుంటుంది. ఒకరిద్దరు నటీనటులు తారాపథాన్ని తప్పక చేరుకోవచ్చు. కొత్తనటులైనా దాదాపు అందరూ బాగానటించారు అనుభవజ్ఞుల్లాగ. సుకన్య మరీ సునాయాసంగా నటించింది. అన్నిపాటలున్నప్పటికి వొక్కటైనా వున్నట్లనిపించలేదు. అంటే సంగీతం అంత భేషుగ్గావుందన్నమాట. ఇక కలర్‌అంటానూ బాగనేవుందికాని, షాట్ మారేప్పుడు అదేమిటో కలర్ కలయిక పరమ జుగుప్సాకరంగావుంది యెందువల్లనో. మొత్తానికి గాలానికి ఎర బెట్టి చేపనులాగినట్లు, అదుర్తిగారు కొత్తతారలముఖాల్ని ముఖపరిచయంచేసి జనాన్ని లాగుతున్నారు.

—

గ్రి. గో. రా.

'సెక్సు' ప్రదర్శనానికిచేసిన ప్రయత్నం శోచనీయంగావుంది.

జయశ్రీ నృత్యం అర్ధనగ్నంలో అయిదు నిమిషాలు చూడచక్కగావుంది. అక్కడ పాడినపాట వెగటుగావుంది. ఇదేకాదు. ఏపాటా వినతగ్గదిగాలేదు. మాటలు కొన్నిచోట్ల బాగవున్నాయి. సంగీతంలో ప్రత్యేకత లేదు.

ప్రథమంగా సరిక్రొత్త తారాగణంతో రంగుల్లో తెలుగు సాంఘికం నిర్మించిన శ్రీ అదుర్తిగారిని 'ఎవరెస్టు' శిఖరమెక్కి కీర్తిగడించిన 'టెన్సింగ్'–అనికొందరంటే అనొచ్చుకాని, నేనుఅనలేకున్నాను. ఎందుచేతంటే ఒక్క నటీనటులనుమాత్రమేక్రొత్తవారిని తీసుకున్నాడు. చిత్రంలో సన్నివేశాలన్నీ పాతనరుకే. మాటలువ్రాసిన ఆత్రేయ, సంగీతం సమకూర్చిన కె. వి. మహదేవన్, ఛాయాగ్రహణం నిర్వహించిన ఎం. ఎల్. రాయ్, నృత్యంనడిపిన హీరాలాల్, పాటలుపాడిన ఘంటసాల, సుశీల అంతా ఆరితేరి పేరుప్రఖ్యాతులు గడించిన పాతచేతులే. వీరినిగూడా క్రొత్తవారిని పెట్టుకొనివుంటే అదుర్తిగారినితప్పకుండా 'టెన్సింగ్' అనివుండవచ్చు. సినిమా కళగాభావించే ఏ కళాకారుడైనా యీ సాహసం చేసివుండేవాడు. సినిమా వ్యాపారంగా భావించేవ్యక్తి అంత సాహసం చెయ్యలేడు.

క్రొత్త నటులతో, పాతసన్నివేశాలతో మిళితమైన యీ చిత్రం ఒకసారి చూడవచ్చు. అదుర్తిగారి దర్శకప్రతిభ తెలుసుకునేందుకుకాదుగాని, క్రొత్తముఖాలు యెలావున్నాయా అని చూచేందుకు.

—

కాంగ్రెస్ దినపత్రిక

(4 వ పేజి తరువాయి)

మానపత్రికా సంపాదకత్వం వహిస్తారనీ, అప్పుడు సుదీర్ఘమైన అనుభవం, ప్రతిభా విశేషాలువున్న నాగేశ్వరరావుగారి సంపాదకత్వం "ఆంధ్రజనత"కు లభించవచ్చును.

కాంగ్రెసు పత్రికల చరిత్రఅంత ఆశాజనకంగాలేదు. పూర్వం ఎన్నోసార్లు ప్రదేశ కాంగ్రెసుపక్షాన వారపత్రికలు నిర్వహించడానికి ప్రయత్నాలు జరిగాయి కాని ఇవన్నీ మూణ్ణాళ్లముచ్చట్లే అయ్యాయి. ఆరేడు సంవత్సరాలక్రితం, పెమ్మరాజు వెంకటరావుగారు; అప్పటి ఆం. ప్ర. కా. సంఘ కార్యదర్శిగా ఒక వారపత్రికను ప్రారంభించారు. దానికి స్వర్గీయ కళా వెంకటరావుగారు ప్రారంభోత్సవంచేస్తూ ఈ విషయమే చెప్పారు. వెంకట్రావుగారి ప్రయత్నం ఫలిస్తుందని నమ్మకం లేకపోయినా ఆశిస్తున్నానని చెప్పారు. వారి ఆశకన్నా నమ్మకమే బలీయమై, అపత్రిక ఏడాదిపాటుకూడా బ్రతకలేకపోయింది.

ఇప్పటికైనా. కాంగ్రెసుముఠా రాజకీయాల్లోకి పత్రికను లాగకుండా, దానికి వేరే శాశ్వతమైన "ట్రస్టు"ను ఏర్పాటుచేసి స్వతంత్రమైన ఆర్థిక ప్రతిపత్తిని దానికి కలిగించ గలిగితే "ఆంధ్రజనత"ను కాంగ్రెసు నాయకులు విజయవంతంగా నిర్వహించలేక పోవడానికి కారణమేమీ కనపడదు.

ఉగాదినాడు, గాంధీభవనంలో ఆంధ్రజనతకు కాంగ్రెసు పత్రికగా జరిగిన ప్రారంభోత్సవంలో నాయకులు చేసిన ప్రసంగాలు విచిత్రరీతిని కొనసాగాయి ముఖ్యమంత్రి మొదలు లక్ష్మణదాసుదాకా, ఏవ్యక్తి స్వప్రయోజనంకోసం ఆంధ్రజనత వుపయోగపడదనీ, కేవలం కాంగ్రెసు ప్రచారంకోసం, ప్రజాసేవకోసంమాత్రమే దాని నిర్వహణ అనే చెప్పారు. ఇలా పదే పదే చెప్పడంలోనే, ఇతరులలో ముఖ్యంగా తోటి కాంగ్రెసు వాదులలో ఈ పత్రికా ప్రచురణ కలిగించిన అపోహలేమిటో తేలిపోయాయి. ఈ అపోహలు నిరాధారమైనవో కావో, ముందు ఈ పత్రిక ఏవిధంగా నిర్వహింపబడుతుందో దానిపైన ఆధారపడి వుంటుంది.

—

తోలుబొమ్మలు

(4 వ పేజీతరువాయి)

ఇంతవరకూ తోలుపరిశ్రమ మన దేశానికి ఆర్జించిపెడ్తున్న విదేశమారకాన్ని యింకా పెంపొందించగలవని పలువురుఅభిప్రాయపడ్తున్నారు. దీనికి బహుముఖ ప్రయత్నమవసరం. ఈకళ అతిప్రాచీనమైనదైనా యిది ప్రదర్శనార్హమైన కళగానే పరిగణింపబడుతున్నదిగాని, చేతిపరిశ్రమగా పరిగణనకురాలేదు. ఈనాడిది చేతివృత్తిగా ప్రోత్సహింపబడితే, దీనినాశ్రయించుకొనివున్నవృత్తికళాకారులకు తగినప్రోత్సాహం లభించి యీ కళ తిరిగి చిగిర్చి, ఫలించి విస్తరిల్లగలదని నా దృఢవిశ్వాసం. డి. సి. పల్లె కేంద్రంలో యీ బహుముఖమైన ప్రయత్నం జరగాలి.

డి. సి. పల్లెలోని బొమ్మలాట కళాకారులు బొమ్మలతయారీలో మందకొడిగా వున్నారు. వారికి కావల్సినసామగ్రి సకాలంలో సమకూర్చటంలోను, తయారైన బొమ్మలు త్వరగా ఖర్చుచేయించడంలోను వాణిజ్యపరిశ్రమలశాఖవారు ప్రత్యేకశ్రద్ధ చూపాలి. ఈ కేంద్రంలో తోలుబొమ్మల తయారీకి 'పప్పెట్ మాస్టర్' మరియు బొమ్మలు (dolls) తయారుచేయడానికి 'డాల్ అసిస్టెంటు' వుద్యోగాలు ఖాళీగావడి వున్నట్లు తెలుస్తుంది. ఈకేంద్రంలో అనేక లోపాలున్నాయి. చర్మంమీద వెంట్రుకలమొదళ్లు పోవడంలేదు. తెగిపోయిన వెంట్రుకలు బాగుచేసిన చర్మంమీద మళ్ళీ అంటుకొని వాళ్ళకు మళ్ళీ పని కల్పిస్తున్నాయి. అందువల్ల తయారైనచర్మంమీద గీతలువస్తున్నాయి. చర్మం రెండవవైపు కండను పూర్తిగా తీసివేయలేకపోతున్నారు. చర్మం నాచువాసన కొడుతూంది. (ఇందువల్ల ఇతరులు అసహ్యించుకోవడమే గాకుండా పురుగులుపడుతున్నాయి. దొరికితే ఎలుకలు బాగా భక్షిస్తాయికూడా.) బొమ్మలపై రంధ్రాలువేయడానికి రెండే రెండు మొరటుపనిముట్లున్నాయి. అవి వుపయోగించడంలో వారి జబ్బలు పీకి బాధపడుతున్నారు. రంగులు మొక్కజొన్నగడ్డికిచుట్టి వేస్తున్నారుగనుక పనిలో సున్నితం, సమానత్వంలేదు, రంగు సమానంగా సర్దుకోవడంలేదు. కాలం మారిపోతున్నా, యీ కళాకారులు యింకా తాత ముత్తాతలనుండి అనుసరిస్తున్నపద్ధతుల్లోనే చర్మంతయారుచేయడం, బొమ్మలు తయారుచేయడం, ప్రదర్శనలివ్వడంలో తు. చ. తప్పకుండా నడుస్తున్నారు.

వీరిప్రదర్శనసంప్రదాయసిద్ధంగా బాగున్నప్పటికీ పట్టణప్రజలను, నేటి నాగరిక ప్రజలను ఆకర్షించేరీతిలోలేదు. పల్లెటూరు వాతావరణంవేరు. అక్కడ కాలక్షేపాలు బహుతక్కువ. తమకు రుచించినా, రుచించకపోయినా యిలాంటి ప్రదర్శనలన్నీ ఆరుబయట ప్రదర్శించే వుచితప్రదర్శనాలు గనుక మధ్యమధ్య నిద్రపోతూ మెలకువ వచ్చినపుడు కేతిగాడు, గంధోళిగాడు, బంగారక్క అని కేకలువేస్తారు. ప్రదర్శనలో ముఖ్యమైన లోపం చర్వితచరణం. ఉదాహరణకు 'రాముడు ఆంజనేయుల్ని పిలిచాడు'–ఈ వాక్యంమీద ఆధారపడి, అరగంట జరుగుతుంది. కేవలం కాలక్షేపన 'వంత', వచనంలో 'వంత', పద్యంలో 'వంత'పాటలో 'వంత' అమితంగా వుండడంవల్ల ఈనాటిప్రేక్షకుడు భరించలేడు. చీటికిమాటికి కనిపించే యీవంత కథాగమనాన్ని చంపివేస్తుంటుంది. కథ చురుకుగా నడవడం ఆకర్షణీయం, ఎంతైనా అవసరం. ప్రదర్శన రెండుగంటలకంటె మించకుండాకూడావుండాలి.

గత రెండుమూడేండ్లనుండి మద్రాసు అడయార్‌లో భారతప్రభుత్వంచే స్థాపించబడిన కేంద్ర చర్మ పరిశోధనాలయంలో 'తోలుబొమ్మలాట' కళపై ప్రత్యేక పరిశోధనవిభాగాన్ని యేర్పాటుచేసి – చర్మం తయారీలోను, చర్మంపై నగిషీరంధ్రాలు వేయడంలోను, రంగులు వేయడంలోను, తోలుబొమ్మలు, తదితర అలంకారిక వస్తూత్పత్తిలోను, ప్రదర్శనాలివ్వడంలోను, ఆధునికపరికరాల వాడకంలోను, అధునాతనపద్ధతులపై పరిశోధాత్మక, ప్రయోగాత్మకకృషి జరుగుతున్నది. ఈ వృత్తి కళాకారులు మా యీ పరిశోధనాలయంలో యీకళాంశాలపై కొన్నాళ్ళపాటు సాంకేతికశిక్షణపొందడం అవసరంగా కనపడుతున్నది. వారిఅభివృద్ధికి, సాంకేతికపరిజ్ఞానానికి అది యెంతైనా తోడ్పడుతుంది. పైన వివరించిన వారలోపాలన్నీ సరిదిద్దుకోగలగడమేకాకుండా తక్కువఖర్చుతో, తక్కువశ్రమతో ఆకర్షణీయపద్ధతుల్లో అధికోత్పత్తిని సాధించవీలవుతుంది.

డి. సి. పల్లెలోని శ్రీ రాజారావు బృందం చాల వుత్సాహంగా పనిచేస్తున్నారు. ఆధునికమైన శాస్త్రీయ సాంకేతికశిక్షణ వారి వుత్సాహాన్ని, శక్తిని మరింత పెంపొందింపజేస్తుంది. ఈ అడయార్ చర్మపరిశోధనసంస్థలో వారికి శిక్షణగరిపి నెల్లూరు జిల్లా వాణిజ్యపరిశ్రమలశాఖ, ఆత్మకూరుసమితి ఈ కేంద్రాభివృద్ధికి యితోధికంగా తోడ్పడగలరని ఆశిద్దాం.

—

పంచాంగం

ప్రాథమిక వృష్టి

ఏప్రెల్ 9- 10, 11 తేదీలు జలచంద్ర 13 తేది వరకు బుధ శుక్రులు ఏకనక్షత్ర సంచారం. ఈ సుయోగస్థితి వర్షహేతువుకు కారణము.

అబ్దసంధి నివృత్తి

ఏప్రెల్ 9 తేదీతో పూర్వాపర సంవత్సరసంధి త్యాగము.

శ్రీరామనవమి

ఏప్రెల్ 10 తేది శనివారం శ్రీరామ నవమి.

ఏప్రెల్ తిథులు

10 శని	నవమి	మ.	2-29 గం.వ.
11 ఆది	దశమి	మ.	12-12 గం.వ.
12 సోమ	ఏకాదశి	ఉ.	9-57 గం.వ.
13 మంగళ	ద్వాదశి	ఉ.	7-54 గం.వ.
14 బుధ	త్రయోదశిఉ.		6-26 గం.వ.
15 గురు	పూర్ణిమ	తె.	4-10 గం.వ.
16 శుక్ర	బ.పాడ్యమిరా.		3-53 గం.వ.

—నిమ్మగడ్డ వెంకటేశ్వరశాస్త్రి.

—